క్లుప్తంగా

జీలుగులు పంపిణీ

సిద్దవటం(ఒంటిమిట్ట): మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో సోమవారం జీలుగులు పంపిణీ చేశారు. ఈ జీలుగుల పంపిణీ కార్యక్రమాన్ని బద్వేల్ డివిజన్ ఏడీఏ మర్రిపాటి నాగరాజు వంతాటిపల్లి, జ్యోతి, సిద్దవటం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలలో విత్తన పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ రెడ్డి, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



చక్రస్నానం చేయిస్తున్న వేదపండితులు

చిన్నమండెం : మండెం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. స్వామి వారి కల్యాణం అనంతరం రాత్రి గ్రామాల్లో ఊరేగింపు ఉన్నప్పటికీ వర్షం కారణంగా సోమవారం ఉదయం దేవగుడిపల్లె, కురవపల్లి, బాబుజీ నగర్‌కాలనీ, జల్లావాండ్లపల్లెలలో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో పెద్ద ఎత్తున డీజే పాటలు, భజనలు, ప్రత్యేక పూజలు, ప్రార్థనలు, మంగళవాయిద్యాలు నడుమ ఊరేగింపు జరిపారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వారికి వేదపండితులు చక్రస్నానాలు చేయించారు. సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

నియామకం

రాజంపేట : ఏపీ షెడ్యూల్డ్ కులాల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర యూనియన్ ఉపాధ్యక్షుడిగా రాజన్న నియమితులయ్యారు. ఈమేరకు ఆయన సోమవారం ఇక్కడి విలేకర్లతో మాట్లాడుతూ విజయవాడలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన జనరల్ బాడీ మీటింగ్‌లో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని తెలిపారు. తనపై ఎంతో నమ్మకంగా ఉంచి పదవి అప్పగించినందుకు వీలైనంత వరకు న్యాయం చేస్తామన్నారు. కాగా రాజన్న కడప ఇరిగేషన్‌లో అసిస్టెంట్ ఇంజనీరుగా పనిచేస్తున్నారు. రాజన్న ఎంపిక పట్ల పలు దళిత సంఘాలకు చెందిన నేతలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

కలెక్టర్‌కు ఆహ్వానం

రాయచోటి టౌన్ : ఈనెల 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించే శ్రీ లక్ష్మీ మహాయజ్ఞంలో పాల్గొనాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌ను అన్నమయ్య జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ మహాయజ్ఞం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయశాఖ మాత్యులు కొట్టు సత్యనారాయణ, దేవాదాయశాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సంబేపల్లె : మండల పరిధిలోని చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం బావులకాడపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో క్రిష్ణయ్య అనే వ్యక్తికి గాయలైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు ఎస్.సోమవరం గ్రామానికి చెందిన క్రిష్ణయ్య సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో కలకడకు వెళుతుండగా రాయచోటి వైపు నుంచి వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో క్రిష్ణయ్య గాయపడ్డారు. చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

స్మశానానికి స్థలం పరిశీలన

రైల్వేకోడూరు : పట్టణంలోని అరుంధతివాడ సమీపంలో స్మశాన స్థలాన్ని పరిశీలించినట్లు సోమవారం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి తెలిపారు. స్మశానానికి స్థలాన్ని కేటాయించాలన్న గ్రామస్తులు కోరిక మేరకు గ్రామానికి సమీపంలో స్మశానానికి స్థల పరిశీలన చేశారు. గ్రామస్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో మల్లు క్రిష్టారెడ్డి, దామర్ల సిద్దయ్య, రమణారెడ్డి, డీపీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు గ్రామోత్సవం

సిద్దవటం(ఒంటిమిట్ట): మాచుపల్లి గ్రామంలో రేణుక ఎల్లమ్మ తిరునాల సందర్భంగా చివర రోజైన సోమవారం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులు కాయా కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రేణుకా ఎల్లమ్మ గుడి దగ్గర నుంచి మొదలైన ఊరేగింపు పురవీధుల గుండా కొనసాగింది.

ఘనంగా ముగిసిన తిరునాల

గాలివీడు : మండల కేంద్రంలోని అరవీడు గ్రామ పంచాయతీలో వెలసిన ధనకొండమ్మ గంగాభవాని తిరునాల సోమవారం ఘనంగా ముగిసింది. ముందుగా రథాన్ని పూలతో ముస్తాబు చేసి అమ్మవారిని కొలువుదీర్చి ఊరేగించారు. మహిళలు పెద్దసంఖ్యలో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ముగిసిన జాతరలు

సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల గ్రామంలో వెలిసిన కొత్తపురమ్మ, గోరావాండ్లపల్లె, కడియాలవాండ్లపల్లో కొలువైన పోలేరమ్మ జాతరలు సోమవారం ముగిశాయి. మొక్కుబడులు తీరిన భక్తులు చాందినీబండ్లను ఆలయాల చుట్టూ తిప్పారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

రాయుడు కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

– గడప గడపకు మన ప్రభుత్వంలో రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి అర్బన్: టీ కొట్టు యజమానురాలికి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : పేద ప్రజల సంక్షేమమే జగనన్న ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డుకు సంబంధించిన రాయుడు కాలనీ, కురవపల్లె, వెంకటరెడ్డిగారిపల్లె, ఎగువ అబ్బవరం గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్విరామంగా ఆయన గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీకాంత్‌రెడ్డికి నీరాజనాలు పలికారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడుతూ వారి సమస్యలపై ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాయుడు కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నామన్నారు. పట్టణంలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులలో భాగంగా రాయుడుకాలనీలో డ్రైనేజీల నిర్మాణం చేస్తామన్నారు. సంక్షేమం, అభివృద్ధిని చేస్తున్న సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని ఆయన కోరారు.

ఇన్ని పథకాలు ఏ ప్రభుత్వంలో చూడలేదు

జగనన్న ప్రభుత్వంలో అమలు చేస్తున్నన్ని సంక్షేమ,అభివృద్ధి పథకాలు ఏ ప్రభుత్వంలోనూ చూడలేదని రాయుడు కాలనీవాసులు ఎమ్మెల్యే ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటి గడప వద్దకు వెళ్లి ఏయే పథకాలు అందాయంటూ కుటుంబీకులకు అడగడం, వారు సంతోషంగా 3 నుంచి 4 పథకాలు అందుతున్నాయంటూ సంతోషంగా బదులివ్వటం కనిపించింది. పేదల కోసం పాటుపడే ఇలాంటి ప్రభుత్వాన్ని గతంలో తామెన్నడూ చూడలేదని, మళ్లీ మళ్లీ జగనన్నే సీఎం కావాలని కోరుకుంటున్నట్లు మహిళలు ఎమ్మెల్యే ఎదుట తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

సమస్యలకు పరిష్కారం

కాలనీలోని ప్రజలతో శ్రీకాంత్‌రెడ్డి మమేకం అవుతూ వారి సమస్యలకు అప్పటికప్పుడే పరిష్కరించాలంటూ అధికారులను ఆదేశిస్తూ ముందుకు సాగారు. కాలనీలోని పాఠశాల వీధిలో రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలంటూ శ్రీకాంత్‌రెడ్డి ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. తమ నివాసాలపై తక్కువ ఎత్తులో వెళుతున్న విద్యుత్ తీగల ఎత్తును పెంచాలంటూ అబ్బవరం రమణమ్మ తదితరులు ఎమ్మెల్యేను కోరగా, సమస్యను పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే అధికారులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, కౌన్సిలర్ చంద్రశేఖర్, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, తహసీల్దార్ ప్రేమంతకుమార్, వైఎస్ఆర్‌సీపీ నేతలు బేపారి మహమ్మద్‌ఖాన్, హబీబుల్లాఖాన్, కొలిమి చాన్‌బాషా, జానం రవీంద్ర, అన్నా సలీం, గోపాల్‌రెడ్డి, ఖాదర్‌వలి, అయ్యవారురెడ్డి, నేలపాటి వెంకటేష్, కొత్తమీర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామస్వామి కల్యాణోత్సవంలో..

చిన్నమండెం : మండలంలోని వండాడి గ్రామం కదిరివాండ్లపల్లెలోని కోదండ రామస్వామి ఆలయ పంచమ వార్షికోత్సవం మినీ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించిన కల్యాణంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, ఎంపీపీ సుధామాధురిలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోదండరాముని దీవెనలు ప్రజలందరికీ అంది సుభిక్షంగా, సంతోషంగా జీవించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకులు రంగారెడ్డి, సర్పంచ్ మునసల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్యామ్, చంద్రారెడ్డి, భూషణ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ధనుష్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చుక్కా అంజనప్ప, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ

రాయచోటి అర్బన్ : స్థానిక లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం టీబీ రోగులకు న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన వైద్యులు మహేశ్వరరాజు, ఉషారాణి దంపతుల ఆర్థిక సౌజన్యంతో బ్రహ్మణ వీధిలోని కృష్ణ హాస్పిటల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు హరీష్‌చంద్ర, సభ్యులు వినోద్‌కుమార్ నాయక్, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ నగేష్, హెల్త్ విజిటర్స్ గంగాదేవి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మాతమ్మ తిరునాల

రాజంపేట టౌన్ : సాతపల్లెలో మంగళవారం నుంచి ఏడు రోజులపాటు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన సంయుక్త కార్యదర్శి తంబెల వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మాతమ్మ తిరునాలను జరుపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక పూజా క్రతువులు చేయనున్నట్లు వారు తెలిపారు. 14వ తేదీ రాత్రి అమ్మవారి ఉత్సవం, 15న జంతు బలి కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే గడపగడపకు

– రంగనాయకులపేటలో గడప గడపకు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కొరముట్ల



పథకాలను వివరిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు : ప్రజా సంక్షేమం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని కోడూరు-1 సచివాలయం పరిధిలోని రంగనాయకులపేటలో గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలు తీరును తెలుసుకునే నూతన ఒరవడికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలను ఎలా కత్తిరించాలనే ఆలోచనతో పరిపాలన చేయగా నేడు మన జగనన్న ప్రభుత్వం అర్హులను వెతికి మరి లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో దృఢ సంకల్పంతో రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం ప్రజాదరణ పొందిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం నాడు-నేడు కార్యక్రమం అనేక రకాలైన హామీలను నెరవేరుస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. గతంలో ఏదైనా ఒక పథకంలో లబ్ధి పొందాలంటే కాళ్లు అరిగేలా కార్యాలయాలు, నాయకులు చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆ పరిస్థితులకు పూర్తి భిన్నంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ మందల నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెట్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్ శివయ్య, సిద్దయ్య, ఎంపీటీసీ ఆంజనేయులు, రత్తయ్య, సుబ్రమణ్యం, రౌఫ్, జనార్దన్ రాజు, ముజీబ్, మస్తాన్‌బాషా, ఇర్ఫాన్ నవాబ్, దాడిశెట్టి సిద్దు, తహసీల్దారు రామ్మోహన్, ఎంపీడీఓ నాగార్జున, వార్డు మెంబర్ మహమ్మద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతులు

రాయచోటి అర్బన్ : ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఐటీఐ అప్రెంటిస్, కాంట్రాక్టు బేసిస్ విధానంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం అప్రెంటిస్ కార్మికులతో కలసి ఆయన జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసిన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమ ఆర్టీసీ జోన్ వర్క్‌షాపులో 2013లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి తిరిగి ఇప్పటివరకు నోటిఫికేషన్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ గ్యారేజీలలో 2వేల మంది కార్మికులు రూ.10వేల వేతనంతో వెట్టిచాకిరి చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీధర్, అలీ, బాబు, శివకుమార్, ఫయాజ్, హరిబాబు, శ్రీకాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

రూ.500కే సిలిండర్ ఇవ్వాలి

రాష్ట్రంలో మహిళలకు కేంద్రప్రభుత్వం రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను అందజేయాలని జిల్లా మహిళా సమైఖ్య నాయకురాళ్లు సుమిత్ర, అరుణ, సునీత, సంపూర్ణలు కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం గ్యాస్ ధరలు తగ్గించాలని, రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను అందించాలంటూ మహిళా సమైఖ్య ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గ్యాస్ ధరలను విపరీతంగా పెంచేసి సామాన్యుల నడ్డి విరుస్తోందన్నారు. ధరలను తగ్గించకపోతే ఉద్యమించక తప్పదంటూ వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నేతలు సాంబశివ, శ్రీనివాసులు, రైతుసంఘం నేత రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మా గ్రామానికి రోడ్డు వేయండి'

రాయచోటి టౌన్ : తమ గ్రామానికి రోడ్డు వేయాలంటూ పుల్లంపేట మండలం కొత్తపల్లె అగ్రహారం ప్రజలకు సోమవారం స్పందన కార్యక్రమంలో ఆ గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులకు సూచిస్తూ త్వరతిగతిన పరిశీలన చేయాలని ఆదేశించారు. అనంతరం వీరు మీడియాతో మాట్లాడుతూ పుల్లంపేట మండలం కేంద్రం నుంచి కొత్తపల్లె అగ్రహారం గ్రామానికి వెళ్లేందుకు దారి లేకపోవడంతో ప్రభుత్వం మా గ్రామానికి తారు రోడ్డు వేయడానికి నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభమైనప్పటికీ.. పనులు మధ్యలో ఆగిపోయాయి. దీంతో మండల కేంద్రానికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తెచ్చామని, అధికారులు రోడ్డు సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం



సుమంత్‌కు మిఠాయిలు తినిపిస్తున్న తల్లిదండ్రులు



లక్ష్మీ అక్షయను సన్మానిస్తున్న దృశ్యం

పుల్లంపేట : మండలంలో ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాలలో ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని లక్ష్మీ అక్షయ 580 మార్కులు సాధించింది. అందుకుగాను పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం వారు విద్యార్థినిని ప్రోత్సహిస్తూ సంఘం అధ్యక్షుడు సుబ్బనరసారెడ్డి ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి చేతులు మీదుగా లక్ష్మీ అక్షయను తల్లిదండ్రుల సమక్షంలో ప్రోత్సాహక బహుమతి కింద రూ.1,116లు, షీల్డ్, దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వాహిద్, కోశాధికారి నరసింహులు, సభ్యుడు జ్యోతీశ్వర్ నాయుడు, సంఘం వలంటీర్ మురళీ, ఎంఐసీ శివ, సీఆర్‌పీలు మణెమ్మ, లీలా కృష్ణయ్య, ఆనంద్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ కుమారుడు మండల టాపర్

పెనగలూరు : మండలంలోని కొండూరు పంచాయతీలోని ఓ జీపు డ్రైవర్ కుమారుడు సుమంత్ కుమార్ (564) పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచాడు. కొండూరు జెడ్పీ హైస్కూల్‌లో చదివి మండల టాపర్‌గా ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. కుమారుడు మండల టాపర్‌గా నిలవడంతో తల్లిదండ్రులు సుబ్బరాయుడు దంపతులు సంతోషం వ్యక్తం చేశారు.

గాలివీటమ్మకు బంగారు కాసుల దండ బహూకరణ

గాలివీడు : గాలివీటమ్మకు రూ. 1.50 లక్షలు విలువజేసే బంగారు కాసుల దండను అదే గ్రామానికి చెందిన పక్కిరెడ్డిపల్లి వాస్తవ్యులు వన్నేటి రవీంద్ర కుటుంబ సభ్యులు బహూకరించారు. సోమవారం వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ నిర్వాహకులకు బంగారు ఆభరణాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులైన కీ.శే. పూజారి వెంకట్రామయ్య, లక్ష్మమ్మ, సోదరుడు కీ.శేలు చంద్రయ్య జ్ఞాపకార్థం అమ్మవారికి బంగారు దండను అందజేశామన్నారు. కార్యక్రమంలో గోపి కృష్ణారెడ్డి, నరసారెడ్డి, రణదీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రాముఖ్యతపై అవగాహన

పుల్లంపేట : విద్యా ప్రాముఖ్యతను అందరూ తెలుసుకోవాలని ఎంఈఓ రంగనాథయ్య తెలిపారు. సోమవారం బావికాడపల్లి ఎస్టీకాలనీని ఆయన సందర్శించి పిల్లల తల్లిదండ్రులకు విద్యా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, విద్య వలన అనేక లాభాలు పొందవచ్చని, రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ పిల్లల చదువు కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఈ అవకాశాన్ని ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడు వీరభద్రస్వామి పల్లకిలో ఊరేగారు. సోమవారం రాత్రి మూల విరాట్ స్వామి వారికి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించి పల్లకిలో ఉంచి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు.ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

దళితులకు ఇంటిపట్టాలు ఇవ్వండి

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు పంచాయతీ జ్ఞానంపల్లి దళితవాడ గ్రామస్తులకు ఇంటిపట్టాలు ఇవ్వాలని సోమవారం సీపీఐ మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ కార్యకర్తలతో కలిసి పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించి పంచాయతీ కార్యదర్శి స్వర్ణకుమారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య మాట్లాడుతూ జ్ఞానంపల్లి దళితవాడ గ్రామస్తులు పక్కా గృహాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి వెంటనే ఇంటిస్థలాలు కేటాయించాలని విన్నవించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగేశ్వరరావు, సరస్వతీ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

పెనగలూరు : రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్, ఎస్వీ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ మధుసూదన్‌ను ఆదివారం రాత్రి ఈటమాపురంలో ఘనంగా సన్మానించారు. జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పుచ్చకాయల శివశంకర్ ఆధ్వర్యంలో వారికి స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో బీసీ యూత్ నాయకులు మధు, పెంచలయ్య, సుధాకర్, విశ్వనాథం, యానాది, నాగరాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న పోలా

రాజంపేట టౌన్ : మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి పట్టణంలో రోడ్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పోలా అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో టేబుల్ అజెండాగా పట్టణంలో ట్రాఫిక్ సమస్యను అధికమించేందుకుగాను రోడ్ల విస్తరణ కోసం రూ.51 కోట్లు మంజూరునకై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఇందులో పాత బస్టాండు నుంచి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వరకు రూ.31 కోట్లు, పోస్టాఫీసు నుంచి పాత బస్టాండు వరకు రూ.20 కోట్లు అవసరమవుతాయని రోడ్లు భవనాల శాఖ అంచనాను రూపొందించింది. ఇదిలావుంటే మున్సిపాలిటీ అభివృద్ధి కోసం వంద కోట్లు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని స్వయంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. అయితే రోడ్ల విస్తరణ కోసం అవసరమయ్యే నిధుల మంజూరునకు కౌన్సిల్‌లో తీర్మానం చేసి పంపాలని ప్రభుత్వం ఆదేశించడంతో నిధుల మంజూరునకు కౌన్సిల్ తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపనున్నారు. కాగా రోడ్డుకు ఇరువైపులా పది అడుగుల మేర రోడ్డు విస్తరించనున్నారు. పాతబస్టాండు ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య జఠిలమైన కారణంగా ఇటీవలే పాతబస్టాండు సర్కిల్‌లో మున్సిపల్ చైర్మన్ సిగ్నల్స్ ఏర్పాటు చేయించారు. ఇప్పుడు రోడ్డు విస్తరణ కోసం ఆయన వడివడిగా అడుగులు వేస్తున్నారు. రోడ్ల విస్తరణకు అవసరమయ్యే నిధుల కోసం కౌన్సిల్‌లో ఆమోదించిన తీర్మానాన్ని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిల ద్వారా ప్రభుత్వానికి పంపనున్నట్లు మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

అక్రమ కట్టడాల తొలగింపు

మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి పట్టణంలో మున్సిపల్ స్థలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపారు. ఇటీవల కోట్లాది రూపాయల విలువ చేసే మున్సిపాలిటీ స్థలాన్ని కొందరు ఆక్రమించుకోగా ఆ స్థలం ఆక్రమణదారుల చెర నుంచి విడిపించారు. తాజాగా సరస్వతీపురం వీధిలో ఓ ఇంటర్నల్ రోడ్డును ఆక్రమించుకొని కట్టిన అక్రమ కట్టడాన్ని తొలిగించడంతో ఆ వీధిలో ఇంటర్నల్ రోడ్డు ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం జనాభా పెరుగుతుండటం, దీనికి తోడు ఆ వీధిలోని మెయిన్ రోడ్డు వర్షం కురిస్తే జలమయం అవుతుండటంతో ఇంటర్నల్ రోడ్డు ఆవశ్యకత ఏర్పడింది. దీంతో అక్కడి ప్రజలు మున్సిపల్ చైర్మన్‌ను కలిసి సమస్యను వివరించారు. పోలా ఆదేశాలతో అక్రమ కట్టడాల తొలగింపు పనులు సోమవారం ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని సరస్వతీపురం వీధిలో వర్షం కురిస్తే నీళ్లు నిలుస్తుంటాయని ఆ సమస్య పరిష్కారానికి రైజింగ్ రోడ్డును వేయించనున్నట్లు చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి సోమవారం తెలిపారు. అదే సమయంలో ప్రజల సౌకర్యం కోసం ఇంటర్నల్ రోడ్డును వేయిస్తామన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో 2023- 24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రేఖ తెలిపారు. ఐదో తరగతి తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో చదివిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ విద్యార్థులు దరఖాస్తులకు అర్హులన్నారు. ఈనెల 9వ తేదీ నుంచి 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొని, పూర్తి చేసిన దరఖాస్తులను పాఠశాలలో అప్పగించాలన్నారు. జూన్ 11వ తేదీన ఏపీ మోడల్ స్కూల్‌లో రాత పరీక్షలు ఉంటాయని, ఈ పరీక్షలో పాసైన విద్యార్థుల ప్రతిభను బట్టి పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశం ఉంటుందని ప్రిన్సిపాల్ రేఖ తెలిపారు. పూర్తి వివరాల కోసం పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.

పెనగలూరులో..

పెనగలూరు : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సీ కోరారు. 2022- 23 విద్యా సంవత్సరంలో ఐదోతరగతి పాసై ఉండాలని ఆమె తెలిపారు. ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 01.09.2011 - 31.08.2013 మధ్య జన్మించి ఉండాలని, అలాగే ఎస్సీ, ఎస్టీలు 1.9.2009, 31.08.2013 మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రవేశ పరీక్ష 11.06.2023వ తేదీన మోడల్ స్కూల్‌లో ఉదయం 10 నుంచి జరుగుతుందని ఆమె తెలియజేశారు. పరీక్ష రుసుము అన్ని కులాల వారు రూ. 150లు చెల్లించాల్సి ఉంటుందని, దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి



గ్రంథాలయంలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

ఓబులవారిపల్లె : గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు నిర్వహించే సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల కేంద్రంలో గ్రంథాలయ అధికారి అష్రఫ్ అలీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులలో విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని, మంచి పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానంతోపాటు విజ్ఞానం పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దవటం(ఒంటిమిట్ట) : సిద్దవటం మండలానికి సంబంధించిన శాఖ గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ వేసవి శిక్షణా తరగతులు ప్రారంభమైనట్లు గ్రంథాలయ అధికారి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ముందుగా 30 మంది విద్యార్థులతో కలిసి ప్రార్థన చేయించి, ధ్యానం చేయించారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం

ఓబులవారిపల్లె : బొమ్మవరం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గూడూరు నారాయణరాజును సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. పక్కా సమాచారంతో గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అతన్ని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 11 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచినట్లు తెలిపారు.

టమాట రైతాంగాన్ని ఆదుకోవాలి

రాయచోటి అర్బన్ : గిట్టుబాటు ధర లభించక, సకాలంలో పంటలు చేతికి అందక నష్టపోయిన టమాట రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివలు డిమాండ్ చేశారు. సోమవారం వారు ఈ విషయమై జిల్లా కలెక్టర్‌ను కలిసి మాట్లాడారు. గిట్టుబాటు ధర లభించక రైతులు పొలాల్లోనే టమాట పంటను వదలేశారన్నారు. కనీసం పెట్టుబడులు చేతికి అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు వెంటనే పంట నష్టపరిహారం చెల్లించాలన్నారు. అప్పుల బాధతో చనిపోయిన రైతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలంటూ కోరారు. తంబళ్లపల్లె నియోజకవర్గం మొలకలచెరువులో పంటరుణాలను తిరిగి చెల్లించాలంటూ బ్యాంకర్లు రైతులను ఇబ్బందులు పెడుతున్నారంటూ తెలిపారు. ప్రభుత్వం వెంటనే పాతరుణాలను మాఫీ చేసి పంటలసాగుకు తిరిగి కొత్తరుణాలు మంజూరు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

చెల్లమ్మల వివాహాలకు అండగా జగనన్న

రాజంపేట : చెల్లమ్మల వివాహాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దన్నలా అండగా నిలుస్తున్నారని ఏపీఆర్టీసీ స్టేట్ డైరెక్టర్ గండికోట గుల్జార్‌బాషా అన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నిరుపేద ముస్లిం కుటుంబాల్లో చెల్లమ్మ వివాహాలకు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలను కొనియాడారు. ఇప్పుడు అందిస్తున్న సాయంతో కలిపి గత ఆరునెలలో ఈ పథకం కింద రూ.16,667 మంది లబ్ధిదారులకు మేలు జరిగినట్లవుతుందన్నారు. వీరి ఖాతాల్లో రూ.125 కోట్లు జమ చేయనున్నట్టు పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోని లేని విధంగా ముస్లింలకు మేలుచేసే విధంగా సంక్షేమం అందించడం అభినందనీయన్నారు.

రచ్చబండ వేదిక ఆవిష్కరణ



రచ్చబండను ప్రారంభిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, నిర్మలాదేవి

సంబేపల్లె : గ్రామంలోని ప్రజల సమస్యలు వినిపించి వాటి పరిష్కార వేదికగా ఈ రచ్చబండ నిలుస్తుందని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని గుట్టపల్లె పంచాయతీ అంకిరెడ్డిగారిపల్లెలో రాష్ట్ర శిల్పకళలు, హస్తకళ, జానపదల డైరెక్టర్ నిర్మలాదేవి, సర్పంచ్ చిదంబరంరెడ్డిల ఆధ్వర్యంలో దాతల సమక్షంలో రచ్చబండ వేదికను ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, నాయకుడు మల్లికార్జునరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రవీంద్రనాయుడు, మాజీ సర్పంచ్ పాలవెంకట్రమణ, రవీంద్ర, క్రిష్ణయ్య పాల్గొన్నారు.